

ఉర్రూతలూగించిన మ్యూజికల్ నైట్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక అయోధ్య మైదానంలో ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్.. ఆహూతులను ఉర్రూతలూగించింది. గాయని గీతామాధురి.. లాలా దర్వాజు, రబ్బరు గాజులు పాటలతో అందరితో చిందేయించారు. ఎమ్మెల్యే అదితి, ఎమ్మెల్సీ గ్రీష్మ.. గీతామాధురి పాటలకు స్టెప్పులు వేసి, కార్యక్రమానికి మరింత ఊపు తెచ్చారు. మరో గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ పాటలతో యువత కేరింతలు కొట్టారు.

పాడుతున్న గీతామాధురి

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు ఘటాలు ఊరేగింపుగా వెళ్లి కోటలోని రౌండ్ మహల్‌లో ఘటాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం కోట ఎదురుగా ఘటాలను ఉంచి పూజారి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

పైడితల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ ధర్మకర్త అశోక్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాన్సాస్ ఛైర్మన్, పైడితల్లి అమ్మవారి ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులు ఎంఎల్‌ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజు తదితరులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనకు ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర, జిల్లా ప్రజలపై ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులు వచ్చే ఏడాది నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం రూ.1.80కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. 9,10 తేదీల్లో ఆలయ ధర్మ కర్త చేతులు మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. వారి వెంట ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న అశోక్ దంపతులు

ఘటంతో వస్తున్న చిన్నారి

పూజలు చేస్తున్న మంత్రులు అనిత, శ్రీనివాస్

పోటెత్తిన భక్తులు

పైడితల్లి అమ్మవారి పండగలో తొలిఘట్టం తొలేళ్ల ఉత్సవ నేపథ్యంలో సోమవారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం మూడు లాంతర్ల నుంచి అర్బన్ కోర్టు బ్యాంకు రోడ్డు వైపు, మరోవైపు ఆలయం నుంచి ఎంజి రోడ్డు వైపు చందన బ్రదర్స్ షాపు వరకు భక్తులు క్యూ కట్టారు. చిన్నా పెద్ద తేడా లేకుండా ఘటాలతో నగరం ఇరువైపుల నుంచి అధిక సంఖ్యలో మహిళలు ఆలయానికి మేళ తాళాలతో చేరుకున్నారు. ఇంకో వైపు అమ్మవారికి ఇష్టమైన పులివేష ధారణలతో విచ్చేశారు. అమ్మవారి దర్శనానికి అశోక్‌గజపతిరాజు కుటుంబీకులు విచ్చేసిన నేపథ్యంలో కోట జంక్షన్, గంటస్తంభం , సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి సుమారుగా ఎటువంటి వాహన రాకపోకలు ఆలయం వైపు రాకుండా పోలీసులు (ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో భక్తులు పోలీసుల తీరుపై మండిపడ్డారు. క్యూ లైన్ లో ఉన్న భక్తులకు బిస్కెట్లు, తాగునీరు, మజ్జిగ వంటివి ఆలయ సిబ్బంది అందజేశారు.

ఘటాలతో మూడేసి గంటలు క్యూలైన్లలో భక్తులు

అమ్మవారి ఘటాలతో మూడేసి గంటలకు పాటు భక్తులు నిల్చోవాల్సిన పరిస్థితి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప వాసాలు ఉండి ఘటాలతో వచ్చే క్యూ లైన్లలో గంటలు తరబడి ఉంచేయడం సరికాదని అధికారుల తీరుపై మండిపడ్డారు. ఘటాలతో వచ్చే వారికి ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

దర్శించుకున్న ప్రముఖులు

పైడితల్లి అమ్మవారిని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వి.అనిత, మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దర్శించుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు.

ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు; ఆలయానికి వస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి దంపతులు

నృత్యం చేస్తున్న కళాకారిణులు

అదిరె.. అదిరె

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట, టౌన్, కంటోన్మెంట్

విజయనగర ఉత్సవాల్లో భాగంగా మహారాజ సంగీత కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. రెండో రోజైన సోమవారం నిర్వహించిన కార్యక్రమాలలో 36 బృందాలు ప్రదర్శనలు ఇచ్చాయి. నాదస్వరం, గాత్రం, వీణ, ఫ్లూట్, వయోలిన్, మృదంగంతో పాటు కూచిపూడి, భారత నాట్యం ప్రదర్శనలు ఉన్నాయి. సుమారు 300 మంది కళాకారులు ప్రతిభను చాటారు. ప్రదర్శన అనంతరం వేదిక ఇన్‌ఛార్జులు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ కవిత, ఎపిఆర్‌ఒ ఎస్.జానకమ్మ, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మండపాక నాగలక్ష్మి కళాకారులకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేసి, దుశ్శాలువతో సత్కరించారు.

గుబాళించిన సాహిత్య సౌరభం

సకల కళలకు సమాహారంగా నిలిచిన విజయనగరంలో సాహిత్య సౌరభం గుబాళించింది. విజయనగరం ఉత్సవాలలో భాగంగా జరిగిన కవి సమ్మేళనం ఆద్యంతం అలరించింది. సుమారు 120 మంది కవులు తమ కవితలను పఠించారు. కవి సమ్మేళనంలో జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ తనద్కైన శైలిలో దేవులపల్లి కృష్ణశాస్త్రిపై కవితా పఠనం గావించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్‌ను సంస్కృత కళాశాల ప్రాచార్యులు జనార్ధన్ నాయుడు ఘనంగా సత్కరించారు.

సంగీత కళాశాలకు పూర్వ వైభవం: ఎంపి

సంగీత కళాశాలను అభివృద్ధి చేసి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. సంగీత కళాశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, కళాకారులను సత్కరించారు. వేదిక ఇంచార్జులు కవిత, జానకమ్మ, నాగలక్ష్మి లను అభినందించారు.

నృత్యం చేస్తున్న కళాకారిణులు



పైడితల్లమ్మ సైకత శిల్పం

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ కవితను సత్కరిస్తున్న ఎంపి కలిశెట్టి

కబడ్డీ, ఖో ఖో విజేతలుగా విజయనగరం జట్టు

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా విజ్జీ మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. వాలీబాల్‌లో కొత్తవలస జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానం బలిజిపేట, తృతీయ స్థానంలో విజయనగరం జట్లు నిలిచాయి. కబడ్డీ విజేత గా విజయనగరం, ద్వితీయ స్థానంలో పాలకొండ, తృతీయ స్థానంలో పిఎస్‌ఆర్ పురం, ఖోఖో విజేతగా విజయనగరం,ద్వితీయ స్థానంలో గర్భాం, తృతీయ స్థానంలో నెల్లిమర్ల జట్లు నిలిచాయి. ఫుట్‌బాల్ విజేతగా టౌన్ స్పోర్టింగ్ క్లబ్ జట్టు, ద్వితీయ స్థానంలో విజ్జి స్టేడియం జట్టు, తృతీయ స్థానంలో సీనియర్ జట్టు నిలిచాయి. విజేతలకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ శ్రీధర్, ఆయా క్రీడాసంఘాల నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గోపి, ధనారెడ్డి అద్భుత ప్రదర్శన

విజయనగరం ఉత్సవాల్లో కోడి రామ్మూర్తి వ్యాయామ సమాజ సభ్యులు సాహస ప్రదర్శన చేశారు. స్థానిక విజ్జి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సైనికుడు గోపి వ్యాన్‌ను, ల్యాబ్ ఉద్యోగి ధనారెడ్డి బుల్లెట్‌ను ఆపి అందరినీ ఆకట్టుకున్నారు. వ్యాయామ సమాజ శిక్షకులు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. వారిని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అభినందించి, సత్కరించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న గోవా గవర్నర్ అశోక్

ముగిసిన సైన్స్ ఎగ్జిబిషన్

రెండు రోజుల పాటు స్థానిక ఎంఆర్ హై స్కూల్ లో విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ సోమవారం సాయంత్రంతో ముగిసింది. సోమవారం ఎగ్జిబిషన్ చూసేందుకు అధిక సంఖ్యలో విద్యార్థులు,తల్లి తండ్రులు హాజరయ్యారు. గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు సైన్స్ ఎగ్జిబిషన్ ను తిలకించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు గురించి,దాని పని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో డిఇఒ యు.మాణిక్యంనాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు. రామతీర్థం జెడ్‌పి హైస్కూలు కె.షణ్ముఖరావు మొదటి స్థానం, వల్లాపురం జెడ్‌పి హైస్కూలు డి.హరినాథ్ ద్వితీయ స్థానం, సిహెచ్ హర్షిత (ఇంటర్), తృతీయ స్థానం, ఎ.సాయికృష్ణ (ప్రభుత్వ ఐటిఐ) విజేతలుగా నిలిచారు. విద్యార్థులు తరుపున ఉపాధ్యాయులు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఉప విద్యా శాఖ అధికారి వెంకటరమణ, విద్యా శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

సిరిమానుకు పూజలు చేస్తున్న జనం

మత సామరస్యానికి ప్రతీక పైడితల్లమ్మ పండగ..

నేడు సిరిమానోత్సవం

ఏర్పాట్లు పూర్తి ● 3గంటలకు ప్రారంభం ● 2600మంది పోలీసులతో బందోబస్తు

సాంస్కృతిక రాజధానిగా, కళలకు కాణాచిగా, విద్యలనగరంగా ఘనతికెక్కిన విజయనగరం భిన్న సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక. ఇందుకు తగ్గట్టే ఏటా పైడితల్లమ్మ పండగ జరుగుతోంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం సిరిమానోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పైడితల్లమ్మవారి పండగ భిన్నత్వంలో ఏకత్వంలా విభిన్న జాతులు, కులాలవారిని ఐక్యం చేస్తోంది. శతాబ్దాల క్రితం నుంచి నిర్వహిస్తున్న ఈ పండగ వెనుక ప్రజల విశ్వాసం, సంప్రదాయాలు దాగివున్నాయి. అన్ని మతాలు, సామాజిక వర్గాలు కలగలిపి జరుపుకునే పండగ ఇది. అందుకే ఏటా లక్షల మంది జనం భాగస్వామ్య మౌతున్నారు. ఈ ఏడాది అందుకు తగ్గట్టే అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పైడితల్లమ్మవారి పండగలో సిరిమానోత్సవం తలమానికంగా నిలుస్తుంది. సుమారు 40అడుగుల ఎత్తుగల సిరిమాను పీఠికపై అమ్మవారి ఆలయ అనువంశిక పూజారి అవరోధిస్తారు. అలయం నుంచి సమీపంలోవున్న విజయనగరం కోటగుమ్మానికి ముమ్మాటు తిరుగుతుంది. దీన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు రాష్ట్ర నలుమూల నుంచీ, ఒడిశా నుంచి లక్షలాది మంది తరలివస్తుంటారు. అనేక జానపద కళారూపాలు సందర్శకులను కనువిందు చేస్తాయి. డప్పువాయిద్యం, ఈ ప్రాంతంలో అత్యంత ప్రాచుర్యం పొందిన పులివేషాలు, చిత్ర, విచిత్రవేషధారణలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. కేవలం సిరిమాను తిరిగే కోట, పైడితలమ్మ ఆలయం మధ్యనే కాకుండా వీధివీధినా ఇటువంటి కళారూపాలు కనువిందు చేస్తాయి. సందర్శకులంతా సిరిమానుపైవున్న పూజారికి అరటిపండు, చిల్లరడబ్బులు విసరడం వంటి సంప్రదాయం కనిపిస్తుంది. ఈ పండ్లు పూజారికి తగిలితే తమ కోరికలు అమ్మవారికి చెప్పుకున్నట్టేనని వారి విశ్వాసం. ఇంతకు మించిన విశేషమేమంటే ఉత్సవాల ప్రారంభం నుంచీ ముగిసేవరకూ వరకు అనేక సామాజిక తరగతుల శ్రమ ఇందులో ఇమిడి ఉంటుంది. సిరిమాను గుర్తించింది మొదలు దాన్ని సంప్రదాయ పూజలతో తెగ్గొట్టడం, పూజారి ఇంటికి తరలించడం, అక్కడ ఉత్సవానికి అనుగుణంగా రూపొందించడం వరకు విశ్వబ్రాహ్మణులు, వేద పండితులు, రజకులు వంటి అనేక కులవృత్తులవారి శ్రమ ఉంటుంది. పాలకపార్టీలు మతోన్మాదుల కనుసన్నల్లో నడుచుకుంటున్న ఈ నేపథ్యంలో సమైఖ్యతను, శాంతియుత వాతావరణాన్ని గుర్తుచేసే పైడితల్లమ్మ పండగ, ఇందులో ఇమిడి ఉన్న కళలు, సంస్కృతి, సంప్రదాయాలే రక్షణగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. ఈఏడాది గంట్యాడ మండలం కొండతామరాపల్లి లోని చింతచెట్టును సిరిమానుగా గుర్తించారు. ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అవరోధించనున్నారు.

హుకుంపేటలోని పూజారి ఇంటివద్ద నుంచి సిరిమానును ఉదయం 10.30గంటలకు పైడితల్లమ్మ ఆలయం వద్దకు మేళతాళాల మధ్య తీసుకొస్తారు. సిరిమానోత్సవానికి ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. మధ్యాహ్నం 3.05 నిమిషాలకు సిరిమానోత్సవం ప్రారంభించి, 4.30 కల్లా పూర్తి చేస్తామని తెలిపారు. ఉదయం 11గంటలకే పూజారి ఇంటివద్దనుంచి సిరిమాను తరలింపు ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జగరకుండా 2600 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. 120 సిసి కెమెరాలను, 12 డ్రోన్స్ తో నిఘా పెట్టారు. అమ్మవారి దర్శనానికి వచ్చే వృద్ధులు, గర్భిణిలు, వికలాంగులకు సహాయ పడేందుకు పోలీసు సేవాదళ్ ను ఏర్పాటు చేశారు. పారిశుధ్య నిర్వహణకు నగర పాలక సంస్థ ఆధ్వర్యాన 900 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. సిరిమాను సంబరాలకు ఇప్పటికే ఆలయం నుంచి నాలుగు వైపులా రోడ్లలో బారికేడ్ల ను సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలు వరకు మాత్రమే అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు.

9వ సారి సిరిమాను అధిరోహణ

పూజారి బంటుపల్లి వెంకటరావు

విజయనగరం టౌన్ : పైడితల్లి అమ్మవారి సిరిమానును 9వ సారి అధిరోహించడం తన పూర్వ జన్మ సుకృతమని పూజారి బంటుపల్లి వెంకటరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి తమ కుటుంబం అమ్మవారి సేవలో ఉందన్నారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలో ఉండి అమ్మవారి సిరిమాను ను అధిరోహించడం తనకు కలిగిన భాగ్యమన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

భక్తుల రాకపోకలకు, దర్శనానికి ప్రాధాన్యత

కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పైడితల్లి అమ్మవారు సిరిమాను పండగ సందర్భంగా మంగళవారం సిరిమాను ఉత్సవం ప్రజలందరూ తిలకించేందుకు, అమ్మవారిని దర్శనం చేసుకోవడానికి వీలుగా బారికేడింగ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్‌పి ఎఆర్ దామోదర్‌తో కలిసి కోట వద్ద నుండి అమ్మవారి గుడి వెనుక భాగాలలో, అంబటి సత్రం కూడలి వరకు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10:30 కు సిరిమాను రథం హుకుంపేటలో బయలుదేరి అమ్మవారి గుడికి చేరుకోవాలని, అక్కడ రథం ఏర్పాట్లను పూర్తి చేసి మూడు గంటలకు సిరిమాను ప్రారంభించాలని సూచించారు. ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ సామాన్య భక్తులందరికీ సులభ దర్శనం కలిగే విధంగా 2,600 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పాడు పడిన భవనాలపై ప్రత్యేక దష్టి సారించామని, ఎటువంటి అవరోధాలు లేకుండా సిరిమాను సాఫీగా తిరిగేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పర్యటనలో ఎఎస్‌పిలు, సౌమ్య లత, షహబాజ్ అహ్మద్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారమే జిఎస్‌టి కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సూపర్ జిఎస్‌టి ప్రచారంలో భాగంగా షెడ్యూల్‌లో ఇచ్చిన లక్ష్యాల మేరకు ఏ రోజు కార్యక్రమాలను ఆ రోజే పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఛాంపియన్స్‌గా ఉన్న సచివాలయ సెక్రటరీలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. సోమవారం కలెక్టర్ సూపర్ జిఎస్‌టి క్యాంపెయిన్, ఎరువుల సరఫరా, పారిశుధ్యంపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టిపై పరిశ్రమల శాఖ ద్వారా ఎంఎస్‌ఎంఇలలో ఎగ్జిబిషన్లు నిర్వహించాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో సూపర్ జిఎస్‌టిపై అవగాహన తరగతులు, విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించారు. వైద్య శాఖ ద్వారా మందులపై సూపర్ జిఎస్‌టి ప్రభావాన్ని అవగాహన కలిగించాలన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులపై రైతు సేవా కేంద్రాల్లో అవగాహన, ర్యాలీలను చేపట్టాలన్నారు. లక్ష్యాలను చేరుకోవాలని, లేకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. యూరియా సరఫరాలో మండల స్థాయి కమిటీలు సమన్వయంగా పని చేయాలన్నారు. ఇ-క్రాప్ నమోదు వేగవంతం కావాలని ఆదేశించారు.

జీవితమంటే సంపూర్ణమైన ఆరోగ్యం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత
- అవగాహన ద్వారానే స్వచ్ఛాంధ్ర సాధ్యం : మంత్రి శ్రీనివాస్
- స్వచ్ఛాంధ్ర-2025 అవార్డుల పంపిణీ

అవార్డులు అందజేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి-కంటోన్మెంట్ /టౌన్

జీవితం అంటే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, హోం శాఖామంత్రి వంగలపూడి అనిత అన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు పరిసరాల పరిశుభ్రతను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం జరిగిన స్వచ్ఛాంధ్ర-2025 జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మొత్తం48 మంది వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్యంగా ఉండటంలో పారిశుధ్య కార్మికులు పాత్ర చాలా కీలకమని అన్నారు. పారిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యాన్ని పక్కనపెట్టి, సేవలందిస్తున్నారని అన్నారు. పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అవార్డులను ప్రవేశపెట్టారని చెప్పారు. రాష్ట్రంలో పేరుకుపోయిన సుమారు 89 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించి, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు కృషి చేశారని చెప్పారు. చెత్తరహిత పరిసరాల పరిశుభ్రతకోసం రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడం వల్లే స్వచ్ఛభారత్ సాధించవచ్చునని అన్నారు. కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమని అన్నారు. ప్రతీఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. స్వచ్ఛత సాధనలో ప్రతీఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. స్వచ్ఛాంధ్ర సాధనకు చేస్తున్న కృషిని, కార్యాచరణ ప్రణాళికను వివరించారు. 15 విభాగాల్లో 48 మంది అవార్డులు గెలుచుకున్నారని చెప్పారు. రెండు రాష్ట్రస్థాయి అవార్డులు కూడా జిల్లాకు లభించాయని తెలిపారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎంఎల్‌సి కావలి గ్రీష్మ మాట్లాడారు. కార్యక్రమంలో రాజాం, నెల్లిమర్ల మున్సిపల్ ఛైర్మన్లు, విజయనగరం మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

లక్కవరపుకోటలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి.. సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ద్వారపూడి రేవతికి రూ.2,24,313, విశ్వనాథ్ వెంకటనాగ సూర్యవసస్సినికి రూ.25931 మంజూరు కావడంతో ఆ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు సిఎం సహాయనిధి రూపంలో అందిస్తున్న సహాయం ఎంతో మేలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, మాజీ సర్పంచ్ చల్ల వెంకటరావు, మాజీ ఎంపిటిసి పిస్సింటి రమేష్ పాల్గొన్నారు.

పారిశ్రామిక నైపుణ్యాలను వెలికి తీయాలి

ప్రజాశక్తి- డెంకాడ

యువతలో పారిశ్రామిక నైపుణ్యాలను వెలికి తీయాలని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం (ట్రెడ్స్) ఐటి ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల మండల జనసేన నాయకులు చనమల్ల వెంకటరమణ, డెంకాడ మండల జనసేన కోఆర్డినేటర్ పైలశంకర్, నియోజకవర్గ ఇండస్ట్రియల్ కోఆర్డినేటర్ దాడిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ సెక్రటరీ జయేష్ కావంగల్, (ట్రెడ్స్) ఐటి ప్రాజెక్ట్ ఇంచార్జ్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

ఉపాధి కూలీలకు ఇకెవైసి తప్పనిసరి అని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ అన్నారు. సోమవారం తునివాడ గ్రామపంచాయతీలో గల ఉపాధి కూలీల ఇకెవైసిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీల ఇకెవైసి ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తి చేయాలన్నారు. మండలంలో 27,080 ఉపాధి కూలీలు ఉన్నారని, ఇప్పటి వరకు 9,872 మంది మాత్రమే ఇకెవైసి చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన ఉపాధి కూలీలు త్వరగా ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 10 నుండి 14వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరిగే 40వ జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు అథ్లెట్లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు పి.వసంత, ఎం.దివ్యవాణి (100, 200 మీటర్ల రన్నింగ్), ఎం.హరీష్ (1500 మీటర్ల రన్నింగ్), బి.హరీష్ (5 కిలోమీటర్ల నడక)ను, కోచ్‌లు సతీష్, మధు, శేఖర్‌ను అథ్లెటిక్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్, ట్రెజరర్ వి.ఆనంద్ కిశోర్ అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కల్యాణి, పిహెచ్‌సి వైద్యులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - గజపతినగరం

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేయాలని ఎంపిడిఒ కళ్యాణి అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా డోర్ టు డోర్ ఫీవర్ సర్వే చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు వ్యాప్తిని నియంత్రించొచ్చని అన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు సాయిక్రుష్ణారెడ్డి, ఆరోఖ్యమిస్ ఎఇ మజ్జి శ్రీను, పంచాయతీ సెక్రటరీలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

కనిమెట్టలో గ్రామసభ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కనిమెట్ట పంచాయతీలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో అపరిష్కృతంగా ఉన్న వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ కాలువల నిర్వహణ వంటి సమస్యలను చర్చించి వాటికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కూనిశెట్టి ఆదిలక్ష్మి అధికారులను కోరారు. రాబోయే సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పంచాయతీలో చేయవలసిన పనులను ముందుగానే గుర్తించి వాటికి తీర్మానం ఆమోదించారు. అనంతరం గ్రామస్తులు నుంచి అనేక సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు జలపారి అప్పలరాజు (శివ), సర్పంచ్ ప్రతినిధి కూనిశెట్టి గోవింద, ఉప సర్పంచ్ చీపురుపల్లి బోడెయ్య, జనసేన నాయకులు జలపారి శ్రీనివాసరావు, ఒబ్బిన తవుడు, బోనెల నర్సింగరావు పంచాయతీ సెక్రెటరీ ప్రవల్లిక, సచివాలయ సిబ్బంది నీలిమ, రజని, ఫీల్డ్ అసిస్టెంట్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభలు

వేపాడ : మండలంలోని 18 గ్రామ సచివాలయాల్లో మంగళవారం గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎపిఒ ఆదిలక్ష్మి తెలిపారు. ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టే పనులపై ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పెద్దలు పాల్గొని, గ్రామసభలను విజయవంతం చేయాలని కోరారు.

గ్రామ పెద్దలకు స్థల పత్రాన్ని అందజేస్తున్న నర్సింహామూర్తి తదితరులు

రామాలయ నిర్మాణానికి స్థల వితరణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో రామాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని దాతలు విరాళంగా అందించారు. తల్లా వేణు విజయ నరసింహమూర్తి, రాధాకృష్ణ, పురుషోత్తం, విజయగోపాలం సోమవారం సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి, గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పంద పత్రాలను అందజేశారు.

జిఎస్‌టి తగ్గింపుతో పేదలకు మేలు : మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

జిఎస్‌టి తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్‌టి- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయ పనిముట్లకు జిఎస్‌టి తగ్గించడం వల్ల రైతులకు అధిక ప్రయోజనాలు కలిగాయని చెప్పారు. జిఎస్‌టి తగ్గింపుపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించేలా గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బంది ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయ పనిముట్లపై ఎంతవరకు రైతుకు ఆదా అవుతుందో, వాటి ప్రయోజనాలను వ్యవసాయ అధికారులు.. మంత్రికి వివరించారు. గజపతినగరం మార్కెట్ యార్డు నుంచి టిడిపి కార్యాలయం వరకు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించగా, మంత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ, వ్యవసాయ శాఖ ఎడి నిర్మల జ్యోతి, ఎంపిడిఒ కళ్యాణి, ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, ఆంధ్ర రిజర్వాయర్ ఆయకట్టు చైర్మన్ సతీష్, పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, టిడిపి సీనియర్ నాయకులు కుమార్ బాబు, రెడ్డి ప్రసాద్, కర్రి సన్యాసిరావు, బొత్స రమణ, కనకల మురళి పాల్గొన్నారు.

దత్తిరాజేరు : కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించడంతో వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరకు వస్తున్నాయని వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. జిఎస్‌టి 2.0పై అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ట్రాక్టర్‌పై పన్ను రేటు 12 శాతం నుండి ఐదు శాతానికి తగ్గడం వల్ల మోడల్ బట్టి రూ.21 వేలు నుండి 85 వేల వరకు ధర తగ్గుతుందని చెప్పారు. రోటవేటర్ స్ప్రింక్లర్ సెట్, డ్రిప్పు పైపులు, స్ప్రేయర్లకు ధర తగ్గిందని వివరించారు. దీంతో వ్యవసాయ పరికరాల కొనుగోలు పెరిగి, సాగుఖర్చు తగ్గి, ఉత్పాదకత పెరుగుతుందని రైతులకు తెలిపారు.

గజపతినగరంలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ; నెల్లిమర్లలో ర్యాలీలో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

బొబ్బిలి : జిఎస్‌జి తగ్గింపుపై రోగులకు బొబ్బిలి సిహెచ్‌సి సూపరింటెండెంట్ శశిభూషణరావు అవగాహన కల్పించారు. హెల్త్‌ఇన్సూరెన్స్, ప్రయివేటు ఆస్పత్రుల్లో మందులు, సేవలపై జిఎస్‌టి తగ్గింపు వల్ల బిల్లులు తగ్గుతాయని చెప్పారు.

జిఎస్‌టి తగ్గింపు వ్యవసాయ రంగానికి మేలు

నెల్లిమర్ల : జిఎస్‌టి తగ్గింపుతో వ్యవసాయ రంగానికి మేలు కలుగుతుందని ఎపి మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. సోమవారం జిఎస్‌టి తగ్గింపుపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ల వస్తు సేవా పన్ను 12శాతం నుండి 5శాతం వరకు తగ్గిందని దీని వల్ల వ్యవసాయ రంగానికి మేలు కలుగుతుందని అన్నారు. ముఖ్యంగా రైతులు ట్రాక్టర్ కొనుక్కుంటే తగ్గిన జిఎస్‌టిని బట్టి రూ.21 వేలు నుంచి రూ. 85 వేల వరకూ తగ్గుతుందన్నారు. స్ప్రింకలర్ పైప్స్, డ్రిప్ మీద కూడా 7శాతం వరకు జిఎస్‌టి తగ్గిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పూసపాటి రేగ ఎఎంసి చైర్‌పర్సన్ గేదెల గాయత్రి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, నియోజకవర్గం ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కె.శ్రీకాంత్, ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు, నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం, జెడి ఎ.భారతి, ఎడిఎ ఎన్. కోటేశ్వరరావు, నెల్లిమర్ల, డెంకాడ ఎఒలు పి.శ్రీలక్ష్మి, టి. సంగీత తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు

ఘనంగా బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని పురిటిపెంటలో బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన రెడ్డి వెంకటరమణ కుటుంబ సభ్యులు అమ్మవారి విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించగా, ఆలయ పునర్నిర్మాణాన్ని గ్రామపెద్దల ఆధ్వర్యాన చేపట్టారు. గ్రామానికి చెందిన మహిళలంతా అమ్మవారికి ఘటాలను తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టిడిపి నాయకులు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, వివి ప్రదీప్‌కుమార్ తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కరణం ఆదినారాయణ, మండలి సురేష్, గొర్లె బంగారునాయుడు, సారికి బంగారునాయుడు, మంత్రి గణపతి (బుజ్జి), శనపతి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాది మంది పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి కృషి చేయాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

కార్మిక సంక్షేమానికి కృషి చేయాలని ఇటీవల వైసిపి కార్మిక భాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన ధవళ లక్ష్మణరావుకు ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్యనాయణ రాజు (సురేష్ బాబు) సూచించారు. సోమవారం మొయిదలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబుని లక్ష్మణరావు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపికైన లక్ష్మణరావు అందరినీ సమిష్టిగా కలుపుకొని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు లక్ష్మణ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయిద గ్రామ పెద్దలు దవళ పైడుపునాయుడు, మొయిద లక్ష్మణరావు, యడ్ల ధర్మ, అట్టాడ శ్రీను, టి.శంకర్‌రావు, పెదమజ్జివెంకటరావు పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

ప్రజాశక్తి - భోగాపురం

బహుజన సమాజ్ పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్సీరామ్ 19వ వర్ధంతి సభ ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్ వద్ద గల పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ ఎరుకొండ వెంకట్రావు తెలిపారు. జిల్లా అధ్యక్షులు కొమ్ము సోములు ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోన్-1 ఇంచార్జి సోము రాంబాబు హాజరుకానున్నారని, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని రావాడ గ్రామంలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నియోజకవర్గ కార్యదర్శి చిన్నారావు పాల్గొన్నారు.

కెఆర్‌పేటలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 25 పశువులకు చూలు తనిఖీలు, 10 పశువులు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు, 35 గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసినట్లు పశువైద్యాధికారి కోరాడ గాయత్రి తెలిపారు. పశువుల యాజమాన్యం, పశుగ్రాస పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెలిబోని ముసలినాయుడు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, విద్యార్థులు

ఆర్‌బిబిలో నీటిని తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కొత్తవలస

పట్టణంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి ఆర్‌యుబిలో నీరు నిల్వ ఉండిపోవడంతో 8 మండలాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. సిపిఎం ఆధ్వర్యాన నడక వంతెనకట్టాలని, నీటిని వెంటనే బయటకు పంపి, ప్రజల రాకపోకలకు ప్రత్యామ్నాయం చూపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, పాలరైతుల సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు విద్యార్థులు, స్థానికులతో కలసి నిరసన తెలిపారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

ప్రజాశక్తి-వేపాడ, గంట్యాడ. కొత్తవలస

వేపాడ, గంట్యాడ, కొత్తవలస మండలాల్లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. గంట్యాడ మండలంలో గంటపాటు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కొత్తవలస మండలంలో సోమవారం ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్తవలస జంక్షన్‌లో ఉన్న ఆర్‌యుబిలో నీరు చేరడంతో రాకపోకలు ఇబ్బందులు ఎదురయ్యాయి.

పిడుగుపడి మహిళ మృతి

చీపురుపల్లి గ్రామానికి చెందిన కొచ్చర్ల సత్యవతి (52) మృతిచెందింది. ఆదివారం సాయంత్రం ఆవుల్ని మేపేందుకు గ్రామ సమీపంలోని విశాఖ-రాయపూర్ గ్రీన్‌ఫీల్డు హైవేకి ఆనుకొని ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లింది. ఆ సమయంలో పిడుగు పడటంతో అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఆమె మరణించింది.

కుర్చీలు లేక..నిలబడేందుకు చోటూ లేక..

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఏటా ఆనందగజపతి ఆడిటోరియంలో సుమారు 15వందల మంది తిలకించే సాంస్కృతిక కార్యక్రమాలను ఈ ఏడాది సంగీత కళాశాలలో ఏర్పాటు చేయడంతో ప్రదర్శికులతో పాటు సందర్శకులూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూర్చునేందుకు కుర్చీలు లేక..నిలబడేందుకు చోటు లేక అవస్థలు ఎదుర్కొన్నారు. ఇక్కడ కనీసం వంద మంది కూడా కూర్చునేందుకు అవకాశం లేకపోవడంతో కార్యక్రమాలు చూసేందుకు వచ్చిన వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల బయట వేదిక ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉంటే అందరికీ తిలకించేందుకు అవకాశం ఉండేదని వ్యాఖ్యానించారు. ఇబ్బందుల నడుమ ఎవరూ పట్టుమని పది నిమిషాలు కూడా ప్రదర్శనలను తిలకించలేకపోయారు. మరోవైపు ప్రదర్శనలు ఇచ్చేందుకు వచ్చిన కళాకారులు సైతం గంటల తరబడి వేదిక ద్వారం వద్దే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

వేదిక లోపల ఖాళీ లేకపోవడంతో బయట ఉన్న కళాకారులు

పిఎసిఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. మండలంలోని పోతనపల్లి వద్దనున్న కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. పిఎసిఎస్ చైర్మన్ జి.ఎస్.నాయుడు, డైరెక్టర్లు గేదెల శ్రీను, వబ్బిన గౌరిశ్వరిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎరువులు, రుణాలు, విత్తనాలు సకాలంలో అందజేసే బాధ్యత పిఎసిఎస్‌పై ఉందన్నారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ, పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఎఎంసి వైస్‌చైర్మన్ ఆదిబాబు, టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రవి, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

రెవెన్యూశాఖపై బురద జల్లడం సమంజసమా? : తహశీల్దార్

ప్రజాశక్తి- రేగిడి

రెవెన్యూ శాఖపై ప్రజా ప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో బురద జల్లడం ఎంతవరకు సమంజసమని తహశీల్దార్ ఐ.కృష్ణ లత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలిపల్లి జగన్మోహన్‌రావులతో పాటు బూరాడ సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు రెవెన్యూ సమస్యలపై శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడిన విషయంపై స్థానిక విలేకరులు తహశీల్దార్‌ను ప్రశ్నించగా రెవెన్యూ సమస్యలు లేకుండానే ప్రజా ప్రతినిధులు రెవెన్యూ శాఖపై బురద జల్లడం విడ్డూరంగా ఉందని సమాధానం ఇచ్చారు. పలు శాఖలు ఉంటుండగా ఒక్క రెవెన్యూ శాఖపై దృష్టి పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాము పనిచేయడం లేదా అని అన్నారు. మండల సమావేశంలో ఎవరైతే ప్రశ్నించారో వారంతా తమ సమస్యలు ఎన్ని ఉన్నాయో చెప్పాలన్నారు. వెంటనే కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రెవెన్యూ సమస్యలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని దరఖాస్తులు పెడ్డింగ్‌లో ఉన్నాయని సిబ్బంది తెలిపారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. తశీల్దార్‌తో పాటు డిటి, సీనియర్ అసిస్టెంట్ మురళి, ఆర్ఐ కోటగిరి, ఉన్నారు.

తిరుగుబాటు చేస్తే సహించం : డిఎస్‌పి

గుర్ల : రాజ్యాంగ వ్యవస్థలపై తిరుగుబాటు చేస్తే సహించేది లేదని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు అన్నారు. సోమవారం గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేవి నిమజ్జనం సందర్భంగా జమ్ము గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో పోలీసులుపై కొంతమంది దురుసుగా ప్రవర్తించడం, హోమ్ గార్డ్‌ను పక్కకు తీసుకెళ్ళికి చంపాలని చూశారన్నారు. గొడవలకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోవడానికి సిఐతో పాటు సిబ్బంది వెళ్లగా గ్రామస్తులు కొంతమంది పోలీసులపై చెప్పులు, బంక మట్టి రాళ్లతో తిరగబడ్డారన్నారు. గ్రామంలో గొడవలకు కారణమైన వారిని, పోలీసులపై తిరగబడ్డ వారిని గుర్తించి అరెస్టు చేస్తున్నామన్నారు. ఇప్పటికే సర్పంచ్ గొర్లెల నరసింహమూర్తి మరో 19ని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో ఉన్న రాజకీయ గ్రూపులపై తమకు ఎలాంటి వివక్షా లేదన్నారు. పోలీసులపై దాడి చేస్తే ఎంతటి వారినైనా వదలు పెట్టేది లేదన్నారు. అనుమానితులందరినీ అదుపులోకి తీసుకుంటామన్నారు.

ప్రమాదాలు సంభవిస్తే గానీ.. స్పందించరా?

ప్రజాశక్తి-శృంగవరపుకోట, వేపాడ

శృంగవరపుకోట నియోజకవర్గంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. మలుపుల్లో అయితే ఎదురుగా వచ్చే వాహనం దగ్గరకొచ్చే వరకూ కనిపించే పరిస్థితి లేదు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వేపాడ మండలంలో సోంపురం జంక్షన్ నుంచి ఆనందపురం వెళ్లే ప్రధానరహదారిలో, చిరుతపాలెం కూడలి నుంచి ఆనందపురం వరకు, బక్కునాయుడుపేటకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా తుప్పలు, డొంకలు పెరిగాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే అవకాశముంది. శృంగవరపుకోట మండల కేంద్రం నుంచి ధర్మవరం, జామి మీదుగా విజయనగరం వెళ్లే మార్గాల్లో రహదారులకు ఇరువైపులా తుప్పలు పెరిగాయి. జంగిల్ క్లియిరెన్స్ చేపట్టకపోవడంతో ప్రతిరోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల జరిగిన శృంగవరపుకోట మండల సర్వసభ్య సమావేశంలో ఆర్అండ్‌బి జెఇ స్వామి... మండలంలో జంగిల్ క్లియిరెన్స్‌కు నిధులు మంజూరయ్యాయని చెప్పి మూడు వారాలు గడిచిపోయాయి. నేటికీ పనులు మాత్రం చేపట్టలేదు. ఇప్పటికైనా వేపాడ, శృంగవరపుకోట మండలాల అధికారులు స్పందించి జంగిల్ క్లియిరెన్స్ పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT GAJAPATHINAGARAM
I.A 187/2024 in O.S 36/2023

Between:
Bogapurapu Harshavardhan Rep by his GPA Holder Bogapurapu Kannamnaidu...Plaintiff
And:
Kolusu Kiran Kumar ......Defendant
To:
Pothula Narayana, S/o late Sannibabu, aged 48 years, residing at Pedakandepalli Village, Near Ramalayam, Srungavarapukota, Vizianagaram District ...Respondent/Defendant No.4

పబ్లికేషన్ (ప్రకటన)

పై నెంబరు దావాలో మీరు ప్రతివాది అయ్యి ఉన్నారు. పైనుదహరించిన నెంబరు ఐ.ఏ 187/2024 ఇన్ ఓ.ఎస్ నెం.36/2023 రులో కోర్టు వారు మీపై ఆర్డరు జారీ చేయడం జరిగినది. సదరు కేసులో మీపై ఎన్నిసార్లు నోటీసు పంపిననూ మీరు అందుకోనందున, సదరు కోర్టు వారు మీపై పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు యిచ్చుటకు ఆర్డరు చేసియున్నందున, మీరు **తే.24-10-2025 దిన** సదరు కోర్టు వారి ముందు **ఉదయం 10:30 గం॥కు** వ్యక్తిగతంగా గాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని హాజరయ్యి మీకు గల వాదోపవాదనలు మరియు ఆక్షేపణలు అభ్యంతరములు తెలియపరచు కోవలసిందిగా కోరడమైనది. లేని యెడల ఈ పరోక్షమున తీర్మాణము జరుపబడును.

D.S.K. BAPUJI, Advocate,
D.No.14-1-125, Flat No.A, Prince Apartments,
Nowroji Road, Maharanipeta,
Visakhapatnam-530002, Cell No. 8639977334

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT GAJAPATHINAGARAM
I.A 188/2024 I.A 65/2023 in O.S 36/2023

Between:
Bogapurapu Harshavardhan Rep by his GPA Holder Bogapurapu Kannamnaidu ....Petitioner/Plaintiff
And:
Kolusu Kiran Kumar ...Respondent/Defendant
To:
Pothula Narayana, S/o late Sannibabu, aged 48 years, residing at Pedakandepalli Village, Near Ramalayam, Srungavarapukota, Vizianagaram District ...Respondent/Defendant No.4

పబ్లికేషన్ (ప్రకటన)

పై నెంబరు దావాలో మీరు ప్రతివాది అయ్యి ఉన్నారు. పైనుదహరించిన నెంబరు ఐ.ఏ 188/2024 ఇన్ ఐ.ఏ 65/2023 ఇన్ ఓ.ఎస్ నెం.36/2023 రులో కోర్టు వారు మీపై ఆర్డరు జారీ చేయడం జరిగినది. సదరు కేసులో మీపై ఎన్నిసార్లు నోటీసు పంపిననూ మీరు అందుకోనందున, సదరు కోర్టు వారు మీపై పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు యిచ్చుటకు ఆర్డరు చేసియున్నందున, మీరు **తే.24-10-2025 దిన** సదరు కోర్టు వారి ముందు **ఉదయం 10:30 గం॥కు** వ్యక్తిగతంగా గాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని హాజరయ్యి మీకు గల వాదోపవాదనలు మరియు ఆక్షేపణలు అభ్యంతరములు తెలియపరచుకోవలసిందిగా కోరడమైనది. లేని యెడల ఈ పరోక్షమున తీర్మాణము జరుపబడును.

D.S.K. BAPUJI, Advocate,
D.No.14-1-125, Flat No.A, Prince Apartments,
Nowroji Road, Maharanipeta,
Visakhapatnam-530002, Cell No. 8639977334